

ఇద్దరు సిఐలకు పోస్టింగ్..మరో ఇద్దరు విఆర్‌కు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఇద్దరు సిఐలకు పోస్టింగ్ ఇస్తూ, మరో ఇద్దరు సిఐలను విఆర్‌కు తరలిస్తూ ఏలూరు రేంజ్ డిఐజి అశోక్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజమహేంద్రవరం వన్‌టౌన్ (లా అండ్ ఆర్డర్) ఇన్‌స్పెక్టర్ ఎస్.లక్ష్మణరావును ఏలూరు రేంజ్ విఆర్‌కు బదిలీ చేశారు. ఏలూరు రేంజ్ విఆర్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావును రాజమహేంద్రవరం వన్‌టౌన్ లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. రాజమహేంద్రవరం త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మధుబాబును ఏలూరు రేంజ్ విఆర్‌కు బదిలీ చేశారు. ఏలూరు రేంజ్ విఆర్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్ ఎస్‌పి.వీరయ్య గౌడ్‌ను రాజమహేంద్రవరం త్రీటౌన్ లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ నియమించారు.

సెలవు.. తప్పని అగచాట్లు..!

సచివాలయ ఉద్యోగులకు ఒక్కరోజు సెలవు కావాలన్నా నరకమే

కామరవరపుకోట మండలంలో పరిస్థితి దారుణం


ఎంపిడిఒను కలిసి సంతకం పెట్టించుకుంటనే సెలవు

ఫోన్లో, వాట్సాప్‌లో చెబితే చెల్లదంటూ మండలాధికారి ఆదేశాలు

మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ తీరుపై విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సచివాలయ ఉద్యోగులు సెలవుకోసం పడుతున్న అగచాట్లు వర్ణనాతీతంగా మారాయి. ఒక్కరోజు సెలవు కావాలంటే నరకం చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పలుచోట్ల సచివాలయ ఉద్యోగుల సెలవు దరఖాస్తుపై ఎంపిడిఒలు వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారుతోంది. నిబంధనలకు విరుద్ధంగా పలువురు ఎంపిడిఒలు వ్యవహరిస్తుండటం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. కామవరపుకోట మండలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ మండలంలో 15 గ్రామ సచివాలయాలున్నాయి. దాదాపు 150 మంది వరకూ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ మండలంలో సచివాలయ ఉద్యోగులకు సెలవుకావాలంటే నానాఅవస్థలు పడుతున్నారు. దీంతో ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిబంధనల ప్రకారం సచివాలయ ఉద్యోగులు సెలవు కావాలంటే సంబంధిత పంచాయతీ సెక్రటరీ(డిడిఒ)కి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆయన అంగీకరించిన తర్వాత సంబంధిత శాఖ మండలాధికారికి వెళుతుంది. అంటే ఎఎన్‌ఎంలు అయితే పిహెచ్‌సి డాక్టర్‌కు, అగ్రికల్చర్ అసిస్టెంట్ అయితే మండల వ్యవసాయాధికారికి ఇలా సంబంధిత శాఖ అధికారికి సెలవు దరఖాస్తు చేరుతోంది. గ్రేడ్-5, గ్రేడ్-6 సెక్రటరీలకు సంబంధించి సెలవు దరఖాస్తులు మాత్రమే ఎంపిడిఒ పరిధిలోకి వెళ్తాయి. మిగిలిన శాఖలకు సంబంధించిన ఉద్యోగుల సెలవు దరఖాస్తులు డిడిఒ, సంబంధిత శాఖ మండలాధికారి మంజూరు చేస్తే సరిపోతుంది. కామవరపుకోట మండల పరిషత్ కార్యాలయ అధికారులు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. డిడిఒ, సంబంధిత శాఖ మండలాధికారి సెలవు మంజూరు చేసిన తర్వాత కూడా నేరుగా ఎంపిడిఒను కలిసి సెలవు దరఖాస్తుపై సంతకం తీసుకోవాలని నిబంధన విధిస్తున్నారు. కామవరపు కోట మండలాధికారులు దీనిపై ప్రత్యేకంగా ఆర్డర్ జారీచేసిన పరిస్థితి సైతం నెలకొంది. ఎంపిడివో అనుమతి తీసుకోకపోతే జీతంలో కోత విధించాల్సి ఉంటుందంటూ ఎంపిడిఒ జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొనడం గమనార్హం. సెలవుకోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు సాయంత్రం ఐదు గంటల తర్వాత మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి ఎంపిడిఒ సంతకం తీసుకోవాలని చెప్పడంపై ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మండల కేంద్రాలకు పలు గ్రామాల సచివాలయాలు 20 కిలోమీటర్లకుపైగా దూరంలో ఉన్నాయి. సెలవుకోసం సాయంత్రం ఐదుగంటల తర్వాత మండల పరిషత్‌కార్యాలయానికి వెళ్లి సంతకం పెట్టించుకోవాలని చెప్పడం ఏ విధంగా సమంజసమంటూ ఉద్యోగులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఫోన్‌చేసినా, వాట్సాప్‌లో సమాచారమిచ్చినా చెల్లదంటూ ఎంపిడిఒ జారీచేసిన ఆర్డర్‌లో పేర్కొనడం గమనార్హం. ఈ మండలంలోని సచివాలయ ఉద్యోగులు సెలవు కావాలంటే నానాయాతన పడుతున్నామంటూ ఉద్యోగులు చెబుతున్నారు. ఇలాంటి ఇబ్బందులు పడలేక ఆరోగ్యం బాగోలేకపోయినా విధులు నిర్వహిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ వ్యవహార శైలి సైతం ఉద్యోగుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. షాడో ఎంపిడిఒగా జూనియర్ అసిస్టెంట్ వ్యవహరిస్తూ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. సెలవు విషయంలో కామవరపుకోట ఎంపిడిఒ కార్యాలయ వ్యవహరిస్తున్న తీరుతో సచివాలయ ఉద్యోగులు విసిగిపోతున్నారు. ఆన్‌లైన్‌లో సెలవుకోసం దరఖాస్తు చేసిన తర్వాత మళ్లీ ఎంపిడిఒను కలిసి సంతకం తీసుకోవడం నిబంధనల్లో ఉందా అంటూ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగుల సెలవు దరఖాస్తులకు సంబంధించి ఉన్నతాధికారులు ఎంపిడిఒలకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. సెలవులతోపాటు, పలు సమస్యలపై కామవరపుకోట మండలానికి చెందిన సచివాలయ ఉద్యోగులు ఆదివారం స్థానిక ఎంఎల్‌ఎ ఎలిజాను కలిసి తమగోడు వెళ్లబోసుకున్నట్లు తెలిసింది. సెలవు మంజూరులో సమస్యలపై కామవరపుకోట ఎంపిడిఒ శ్రీదేవిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - పంచాయతీ రాజ్ శాఖ
మండల పరిషత్ అభివృద్ధి అధికారి ,మండల ప్రజా పరిషత్ కామవరపుకోట వారి కార్యాలయము

ఆర్.సి.నెం.సి/02/2022 తేది.27-05-2022

మెమో

విషయము : గ్రామ సచివాలయ సిబ్బంది -మండల ప్రజాపరిషత్ కామవరపుకోట- గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు పై MPDO వారి అనుమతి లేకుండా సెలవులో వెళ్ళిన వారికి ఆ రోజు జీతము నిలుపుదల చేయుటకు గ్రామ సచివాలయ కార్యదర్శులు (డి. డి. ఓ) లకు తగు సూచనలు జారీ చేయుట గురించి.

సూచిక : శ్రీయుత మండల పరిషత్ అభివృద్ధి అధికారి ,కామవరపుకోట వారి సమావేశము తేది. 27.05.2022

@@@


పై సూచికను అనుసరించి ది.27.05.2022 వ తేదిన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బంది బయో మెట్రిక్ హాజరు పై రివ్యూ జరిగినది.సదరు రివ్యూ నందు ప్రతి రోజు సచివాలయ సిబ్బంది హాజరు 100% ఉండాలని అదే విధముగా సచివాలయ సిబ్బంది సెలవు విషయంలో దరఖాస్తు పై గ్రామ సచివాలయ కార్యదర్శి సంతకము మరియు వారి శాఖ యొక్క అనుమతి పొందినను మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి యొక్క అనుమతి దరఖాస్తు ద్వారా తప్పని సరిగా పొందాలని ఫోన్ మరియు వాట్సప్ ద్వారా MPDO గారికి తెలియజేసిననూ అటువంటి లీవ్ మంజూరు చేయబడవని తెలియజేయడమైనది. ఏ శాఖ సిబ్బంది అయినా MPDO గారి తుది అనుమతి లేకుండా సెలవు పెట్టినట్లయితే సదరు సిబ్బంది యొక్క జీతము ఆ రోజున కోత విధించవలసినదిగా గ్రామ సచివాలయ కార్యదర్శులు (డి. డి. ఓ) లను ఆదేశించడమైనది. అదే విధముగా ప్రతి రోజు సచివాలయ సిబ్బంది హాజరు ఉదయం 10 గంటల లోపు మరియు 3.00 గంటల లోపు మరియు సాయంత్రం 05.00 గంటల తరువాత మాత్రమే తప్పని సరిగా వేయవలెనని తెలియజేయడమైనది. హాజరు ఆలస్యంగా వేసినను అటువంటి సిబ్బంది పై కూడా చర్యలు తప్పవని తెలియజేయడమైనది.గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు విషయంలో డి.డి.ఓ లుగా పంచాయతీ కార్యదర్శులు పూర్తి భాద్యత వహించవలసి ఉంటుంది. అదే విధముగా ప్రతి రోజు జరుగు శ్రీయుత కలెక్టర్ ,ఏలూరు జిల్లా వారి వీడియో కాన్ఫరెన్స్ మరియు టెలీ కాన్ఫరెన్స్ నందు MPDO గారిని బయో మెట్రిక్ హాజరు పై ప్రగతి అడుగుచున్నందున సమాధానం చెప్పవలసి వస్తుంది.కావున గ్రామ సచివాలయ సిబ్బంది సెలవు మంజూరు విషయంలో పై సూచనలు తప్పని సరిగా పాటించవలసినదిగా గ్రామ సచివాలయ కార్యదర్శులు (డి. డి. ఓ) లను ఆదేశించడమైనది.

మండల పరిషత్ అభివృద్ధి అధికారి
మండల ప్రజా పరిషత్ కామవరపుకోట.

కాపీ టు :
మండలములోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు(డి. డి. ఓ) లకు పై ఆదేశములు పాటించు నిమిత్తం

27/05/2022

పంచాయతీ సెక్రటరీ, సంబంధితశాఖ మండలాధికారితో పాటు, సెలవు దరఖాస్తుపై ఎంపిడిఒ సంతకం తీసుకోవాలంటూ కామవరపుకోట ఎంపిడిఒ జారీచేసిన కాపీ



చింతలపూడిలో..



నిడమర్రులో..



పోలవరంలో..

మహాధర్నాకు వెళ్లొద్దంటూ నోటీసులు

ప్రజాశక్తి - విలేకరులు

ఈనెల 25వ తేదీన విజయవాడలో జరిగే అంగన్‌వాడీల మహాధర్నాకు వెళ్లొద్దంటూ జిల్లాలోని అంగన్‌వాడీలకు, సిఐటియు, ఇతర కార్మిక, ప్రజాసంఘాల నేతలకు పోలీసులు నోటీసులు అందించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవంటూ పలుచోట్ల హెచ్చరికలు సైతం జారీచేయడం విస్మయం కలిగిస్తోంది.

చింతలపూడి :అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ మహాధర్నాకు వెళ్తున్న అంగన్‌వాడీలను గృహనిర్బంధం చేయడం అప్రజాస్వామికమని సిఐటియు జిల్లా నాయకులు ఆర్‌విఎస్.సత్యనారాయణ, మండల అధ్యక్షులు నత్తా వెంకటేశ్వరావు అన్నారు. చింతలపూడి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ప్రెసిడెంట్ సరోజినీకి, మండలంలో ఉన్న అంగన్‌వాడీలకు ముందస్తుగా నోటీసులు అందజేశారు.

నిడమర్రు:అక్రమ అరెస్టులు, నిర్బంధాలను ప్రభుత్వం మానుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు అన్నారు. ఈనెల 25న విజయవాడలో జరిగే అంగన్‌వాడీల ధర్నాకు వెళ్లొద్దంటూ పోలీసులు రమణరావుకు ఆదివారం నోటీసు అందించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరన్నారు. ఈ నోటీసులివ్వడం కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలిగించడమేనన్నారు. అలాగే సిఐటియు నాయకులు పి.హరికుమారి, కంచం వరప్రసాద్, కమిలి నాని, లావేటి సోంబాబు, కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, అక్రమ అరెస్టులను ఖండించారు.

పోలవరం : మండల కేంద్రమైన పోలవరంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు పిఎల్‌ఎస్.కుమారికి పోలీసులు నోటీసు అందించారు.

అంగన్‌వాడీలపై నిర్బంధాలు దారుణం : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు

అంగన్‌వాడీలు తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 25వ తేదీన తలపెట్టిన ధర్నాను విఫలం చేయడానికి ప్రభుత్వం గృహనిర్బంధాలు, అక్రమ అరెస్టులకు పాల్పడటాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యయుతంగా జరిగే ధర్నాలో హింస జరుగుతుందనే తప్పుడు ప్రచారం పోలీసులు చేయడం గర్హనీయమన్నారు. ఎక్కడికక్కడ ఇళ్లవద్దనే అరెస్టులు చేసి నిర్బంధించడం, వాహనాలను అడ్డుకోవడం, ధర్నాకు అనుమతివ్వకపోవడం అప్రజాస్వామికమని విమర్శించారు. అంగన్‌వాడీ కార్మికులు తమ సమస్యలకోసం గత కొంతకాలంగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నారని, కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు, ప్రదర్శనలు చేశారని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన లేదని, రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి పూనుకోకుండా నిర్బంధం ప్రయోగించడం దారుణమన్నారు. తమ న్యాయసమ్మతమైన కోర్కెలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం, నిరసన తెలపడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని తెలిపారు. ఆ హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని హరించడమేనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేసినవారిని తక్షణం విడుదల చేయాలని, విజయవాడ ధర్నాకు అనుమతినివ్వాలని, వారి న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని, అందుకు సంఘ నాయకులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

ఏలూరు అర్బన్:న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీ వర్కర్లపై రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరించడం పట్ల సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ముందు సిఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ విజయవాడలో ధర్నాకు కూడా ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజాస్వామ్య దేశంలో ఉంటూ జగన్ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. జిల్లాలో పోలీసులు అర్ధరాత్రి సిఐటియు నాయకులు, అంగన్వాడీ వర్కర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్ ఎన్నికల ముందు అనేక హామీలిచ్చారని, వాటిని అమలు చేయమని అడిగిన నేరానికి కార్మికులపై నిర్బంధకాండకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైసిపి అధికారంలోకి వచ్చాక కేవలం రూ.వెయ్యి మాత్రమే వేతనాలు పెంచారని, కానీ ధరలు మాత్రం నాలుగు రెట్లు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే వేతనాలు మాత్రం నామమాత్రంగా పెంచుతూ అంగన్వాడీలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ కంటే మన రాష్ట్రంలోఅంగన్వాడీలకు ఎక్కువ వేతనాలిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఆ హామీని మర్చిపోయారన్నారు. ఆంధ్రా కంటే తెలంగాణలో రూ.3000 ఎక్కువ వేతనం ఇస్తున్నారని, ఇక్కడ మాత్రం మొండిచేయి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలపై తీవ్ర వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎఫ్‌ఆర్‌ఎస్, తదితర యాప్‌ల పేరుతో పనిభారాన్ని మోపుతూ చాలీచాలని వేతనాలిస్తున్నారని విమర్శించారు. అరకొరగా నిధులు కేటాయిస్తూ కార్మికులను తీవ్రఇబ్బందులు గురి చేయడం అన్యాయమన్నారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం పోలీసుల ద్వారా అమానుష చర్యలకు పాల్ప డుతుందని విమర్శించారు. జిల్లాలో పోలీసులు అంగన్వాడీల ఇళ్లకు వెళ్లి బెదిరించి, భయపెట్టి నిరంకుశ చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, అప్రజా స్వామిక విధానాలు విడనాడాలని హితవుపలికారు. ఈ సమా వేశంలో సిఐటియు ఏలూరు నగర కార్యదర్శి వి.సాయిబాబు, వివిఎన్.ప్రసాద్, బి.జగన్నాధరావు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు కొరటాల

శతజయంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఏలూరు

సిపిఎం పూర్వపు రాష్ట్రకార్యదర్శి, కార్మిక, కర్షకనేత కొరటాల సత్యనారాయణ జీవితం అందరికీ ఆదర్శమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు మంతెన సీతారాం అన్నారు. ఆదివారం స్థానిక ఉద్దరాజురామం భవనం (సిపిఎంకార్యాలయం)లో జరిగిన కొరటాల సత్యనారాయణ శతజయంతి సభ సిపిఎం జిల్లా కార్యదర్శి రవి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీతారాం మాట్లాడారు. ముందుగా కొరటాల చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొరటాల రెండుసార్లు ఎంఎల్‌ఎగా, సిపిఎం రాష్ట్రకార్యదర్శిగా, పొలిట్ బ్యూరో సభ్యునిగా పలు ఉన్నత బాధ్యతలు నిర్వహించినా సాధారణ వ్యక్తిలా కార్యకర్తలతో, ప్రజలతో సైతం కలిసిపోయేవారన్నారు. చేనేత కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై లోతైన అధ్యయనం సాగించి వారి సమస్యలపై పోరాటాలకు నాయకత్వం వహించిన నేత అని అన్నారు. రాజకీయాలు వ్యాపారంగా మార్చిన ఈ తరుణంలో సమాజ మార్పునకు చేసి కృషి నేటితరం కార్యకర్తలకు ఆదర్శనీయమన్నారు. ఒకప్రక్క మతోన్మాదం, మరోపక్క ప్రజాస్వామ్యాన్ని కాలరాసి నిరంకుశత్వంతో వ్యవహరించే ధోరణి పెచ్చరిల్లుతోందన్నారు. సామాన్యుల సమస్యలు, జీవితాలను గాలికొదిలి, రాజకీయాల్లో రూ.కోట్లకు పడగలెత్తే ధోరణలు రాజ్యమేలుతున్నాయన్నారు కొద్దిపాటి పథకాలతో ఊరించి ప్రజలను భ్రమల్లో ఉంచేందుకు అధికార, ప్రతిపక్షపార్టీలు పోటీపడుతున్నాయన్నారు. ఈ తరుణంలో ప్రజా జీవితాల్లో సమూలమైన మార్పు కోసం కొరటాల చూపిన బాటలో మనమందరం సాగాలని సీతారాం పిలుపునిచ్చారు. జిల్లా ఏజెన్సీ ప్రాంత భూఉద్యమాన్ని సాగించడంలో కొరటాల నిరంతరం అనేక విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కొరటాల సామాన్యులను, యువతను సైతం అక్కున చేర్చుకుని ఆప్యాయంగా మాట్లాడే వారిని, తద్వారా అందరి మనసులను గెలుచుకున్నారన్నారు. యువతను వారి సమస్యలు మనోభావాలను అర్థం చేసుకుని వారిని నడిపించేందుకు విశేషకృషి సాగించారన్నారు. ఈ సభలో డిఎన్‌వి.ప్రసాద్, పి.కిషోర్ మాట్లాడారు. ఈ సభలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, జిల్లా నలుమూలల నుండి సిపిఎం కార్యకర్తలు హాజరయ్యారు.




ఆర్‌టిసి ప్రయాణికులకు మెరుగైన వసతులు

పటిష్టంగా కార్గో సేవలు

రోజుకు రూ.1.50 లక్షల కార్గో ఆదాయం

దసరాకు ప్రత్యేక సర్వీసులు

జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్





ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రజలు ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం చేసి సురక్షితమైన ప్రయాణ అనుభవాన్ని పొందటమే కాక ఆర్‌టిసి అభివృద్ధికి పాటుపడాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ పిలుపునిచ్చారు. జిల్లాలో ఎన్ని డిపోల పరిధిలో ఎన్ని బస్సులున్నాయి? ఏయే రూట్లలో ప్రజలకు సేవలందిస్తున్నాయి? దసరా సెలవుల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు ఏమైనా చేస్తున్నారా... తదితర ప్రశ్నలకు ప్రజాశక్తి ముఖాముఖీలో ఆయన సమాధానాలిచ్చారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని ఆర్టీసీ డిపోలున్నాయి? బస్సులెన్ని ఉన్నాయి? ఏయే రూట్లలో ప్రజలకు సేవలందిస్తున్నాయి?

జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోలలో 300 బస్సులున్నాయి. అందులో 213 ఆర్‌టిసి బస్సులు కాగా 87 అద్దె బస్సులున్నాయి. మొత్తం 98 రూట్లలో ప్రజలకు సేవలందిస్తున్నాయి.

ప్రశ్న : జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్రంలోని ఏయే ప్రాంతాలకు ఎన్ని బస్సులున్నాయి?

జిల్లాలో ఏలూరు డిపో నుంచి హైదరాబాద్‌కు తొమ్మిది బస్సులు, నూజివీడు డిపో నుంచి హైదరాబాద్‌కు తొమ్మిది బస్సులు, జంగారెడ్డిగూడెం డిపో నుంచి ఏడు బస్సులున్నాయి. అంతేగాక జంగారెడ్డిగూడెం నుంచి భద్రాచలానికి రెండు బస్సులు, ఏలూరు నుంచి సత్తుపల్లికి ఐదు బస్సులున్నాయి.

ప్రశ్న : జిల్లా నుంచి ప్రముఖ క్షేత్రాలకు గానీ, పర్యాటక ప్రాంతాలకు గానీ ప్రత్యేక సర్వీసులేమైనా ఉన్నాయా?

ప్రతీశనివారం తూర్పుగోదావరి జిల్లాలోని వాడపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయానికి ఏలూరు, జంగారెడ్డిగూడెం డిపోల నుంచి ఐదు బస్సులు తిరుగుతున్నాయి. అలాగే ప్రతీశనివారం ఏలూరు డిపో నుంచి ద్వారకాతిరుమలకు అదనంగా నాలుగు బస్సులు ఏర్పాటు చేశాము. అలాగే ప్రతినెలా పౌర్ణమి రోజు తమిళనాడులోని అరుణాచలం వరకూ ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశాము. ఈ బస్సు వెళ్లేటప్పుడు నేరుగా అరుణాచలం వెళ్లి వచ్చేటప్పుడు తిరుపతి సందర్శించి వస్తుంది. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుంది.

ప్రశ్న : జిల్లాలో అదనంగా కొత్త రూట్‌లకు బస్సులు కావాలని ప్రజల నుంచి వినతులు ఏమైనా వచ్చాయా?

అలాంటిదేమీ లేదు. కానీ హైదరాబాద్, భద్రాచలం, విజయవాడ నాన్ స్టాప్ కోసం అదనంగా బస్సులు కావాలని ప్రభుత్వాన్ని కోరాము. త్వరలోనే మంజూరయ్యే అవకాశం ఉంది.

ప్రశ్న : జిల్లాలో కార్గో సర్వీస్ ఎలా ఉంది? డోర్ డెలివరీ కొనసాగిస్తున్నారా?

జిల్లాలో కార్గో సర్వీస్ బాగా నడుస్తుంది. దీని ద్వారా రోజుకు లక్షా 50 వేల రూపాయల ఆదాయం వస్తుంది. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోలతోపాటు ఏలూరు పాతబస్టాండ్, కొయ్యలగూడెం, కామవరపుకోట, చింతలపూడి, కైకలూరు, ముదినేపల్లి ప్రాంతాల నుంచి కార్గో సర్వీసులు బుక్ చేస్తున్నాము. 10 కిలోమీటర్లలోపు ఉన్నవారికి డోర్ డెలివరీ చేస్తున్నాము.

ప్రశ్న : ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్‌టిసి ఎలాంటి చర్యలు చేపట్టింది?


ప్రయాణికుల సౌకర్యానికి చాలా ప్రాధాన్యతిస్తున్నాము. అన్ని బస్టాండ్లలో ప్రయాణికుల కోసం కుర్చీలు, తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశాము. అంతేకాక ప్రయాణికులు తమ బస్సుల వివరాలు తెలుసుకునేందుకు ఎప్పటికప్పుడు మైక్‌ద్వారా అనౌన్స్ చేస్తున్నాము.

ప్రశ్న : వచ్చేనెలలో దసరా పండుగ సందర్భంలో ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక సర్వీసులు ఏమైనా ఏర్పాటు చేస్తున్నారా?

దసరా సందర్భంగా సెలవుల్లో ఎక్కువగా హైదరాబాద్ నుంచి మన జిల్లాకు ప్రయాణికులు వచ్చే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని వచ్చేనెల 13, 14, 20, 21, 22 తేదీల్లో హైదరాబాద్ నుంచి ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెంకు ప్రతిరోజూ ఆరు ప్రత్యేక బస్సులు అదనంగా నడపడానికి నిర్ణయం తీసుకున్నాము. దీనికి సంబంధించి అడ్వాన్స్ బుకింగ్ ఇప్పటికే ప్రారంభించాము.

ప్రశ్న : ఆర్‌టిసి ప్రయాణికులకు మీరిచ్చే సలహా?

ఆర్‌టిసిని ఆదరించి బస్సులలో ప్రయాణం చేయడం వల్ల ఆటోలు, కార్లతో పోలిస్తే ప్రజలకు తక్కువ ఛార్జీలతో ఎక్కువ దూరం ప్రయాణించే అవకాశం కలుగుతుంది. అంతేకాక ఆర్‌టిసి ప్రయాణం సురక్షితం కూడా. ప్రజలు ఆర్‌టిసిలో ప్రయాణించి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరుతున్నాను.



దళిత రక్షణ యాత్రలో నాయకులు, పేదలు

పేదల గుడిసెలకు పట్టాలివ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివనాగరాణి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పేదలు నివసిస్తున్న గుడిసెలకు పట్టాలివ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శివనాగరాణి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కేతవరంలో దళిత రక్షణ యాత్రను జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం ప్రారంభించారు. కేతవరం, పేరంపేట, నాగులగూడెం గ్రామాల దళితపేటల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం నాగులగూడెం గ్రామ ప్రభుత్వ భూముల్లో పర్యటించి పేదలతో మాట్లాడారు. అనంతరం వి.శివనాగరాణి మాట్లాడుతూ నాగులగూడెంలో 439, 440 సర్వే నెంబర్లలో ప్రభుత్వ డొంక పోరంబోకు భూముల్లో పేదలు గత 20 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని 40 కుటుంబాలు జీవిస్తున్నారని తక్షణం వీరికి మూడు సెంట్లు చొప్పున ఇళ్ల పట్టాలివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఎస్‌సి, ఎస్టిఇ సబ్‌ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని, ఈనెల 29న విజయవాడలోని మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో, రాష్ట్రంలో పరిపాలన అధ్వానంగా తయారైందన్నారు.

దళిత హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని

దళిత రక్షణ యాత్ర ప్రారంభం

విమర్శించారు. అనేక సంవత్సరాలుగా దళితులు సామాజికన్యాయం కోసం రోడ్డెక్కుతున్న వారికి న్యాయం జరగడంలేదని అసహనం వ్యక్తం చేశారు. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో దాదాపు 45 సంఘాలు కలిసికట్టుగా ఏర్పడి దళితుల అభ్యున్నతికి పనిచేస్తున్నాయని తెలిపారు. దళిత గిరిజనులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను 300 యూనిట్లకు పెంచాలని, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, డప్పు, చర్మకారుల పెన్షన్ రూ.ఐదు వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. శ్మశానంలో పనిచేస్తున్న కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని. ప్రభుత్వరంగాన్ని కాపాడి, ప్రయివేటురంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఈనెల 29వ తేదీన చలో విజయవాడ కార్యక్రమానికి వ్యవసాయ కార్మికులు దళితులంతా పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి ఎ.ప్రభాకర్‌రావు, ఎం.ఆనందరావు, కె.సుబ్బారావు, జి.సూర్యకిరణ్, నిట్ట నాగరాజు, కె.చిరంజీవి, సిహెచ్.మరియమ్మ, ఎం.కుమారి, కె.సుబ్బమ్మ, కె.రత్నం, జి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు

జగనన్న ఆరోగ్య సురక్షతతో అందరికీ ఆరోగ్యం

పటిష్ట ఏర్పాట్లు చేసిన కలెక్టర్

30 నుంచి ఊరూరా హెల్త్ క్యాంపులు

ఐదు దశల్లో కార్యక్రమం అమలుకు చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు

జగనన్న ఆరోగ్య సురక్షతో, గడపగడపకూ తిరిగి వాలంటీర్లు ప్రజల ఆరోగ్య పరిస్థితిని వాకబు చేస్తున్నారు. ఇందుకు ప్రత్యేక కార్యాచరణను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రూపొందించారు. అందుకు అనుగుణంగా ప్రత్యేక విధులను ఆయా జిల్లా అధికారులకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి ఇంటిలోని కుటుంబ సభ్యులకు ఏడు ప్రాథమిక పరీక్షలు చేసి ఏవైనా సమస్యలుంటే వాటిని గుర్తించి పరిష్కంచేందుకు ప్రభుత్వం సమగ్ర సర్వేను నిర్వహిస్తోంది. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకూ ఎఎన్‌ఎంలు ఐదు లక్షల గృహాల్లో సర్వే చేపట్టారు. పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఈ కార్యక్రమం ద్వారా ప్రతీఇంటిలో అందరి ఆరోగ్యం గురించి ప్రభుత్వ సిబ్బంది వాకబు చేస్తారు. ఆ తర్వాత వైద్య శిబిరాల్లో పరీక్షలు చేసి అవసరమైన వారికి మెరుగైన వైద్యాన్ని అందిస్తారు. దీనిద్వారా ఆరోగ్య సమస్యలు మరింత పెద్దవై, చికిత్సకు లొంగనిదశకు చేరకుండా ముందుగానే గుర్తించి, వైద్యం అందించి, ఆరోగ్యవంతులుగా చేయడం ఈ కార్యక్రమ లక్ష్యం. 5 దశల్లో ఈ కార్యక్రమం అమలుచేయనున్నారు. ఈనెల 15 నుంచి వాలంటీర్లు ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం తరహాలోనే 'జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కూడా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, ప్రజల ఆరోగ్య సమస్యలు, అవసరాలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తారు. తొలుత వాలంటీర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులు వారి పరిధిలోని ఇళ్లను సందర్శించి, ప్రజలందరికి ఈ కార్యక్రమం గురించి అవగాహన కల్పిస్తారు. తొలి దశవైద్య శిబిరాలు నిర్వహించే పట్టణాలు, గ్రామాల్లో ముందుగా ఈ క్యాంపెయిన్ మొదలవుతుంది. జిల్లావ్యాప్తంగా ఉన్న 5,47,790 కుటుంబాలకు చెందిన గృహాల్లో ఆరోగ్యశ్రీ సేవలనువివరిస్తూ ప్రత్యేక బ్రోచరు వాలంటీర్లు అందజేస్తున్నారు. పథకం కింద ఎన్ని రకాలజబ్బులకు చికిత్స అందిస్తారు. వైద్యం అందించే ఆస్పత్రులు, వాటి చిరునామాలు, ఇతర వివరాలు ఉంటాయి. అదే విధంగా స్మార్ట్ ఫోన్లలో ఆరోగ్యశ్రీ సిటిజెన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి దాని వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈనెల 30వ తేదీ నుంచి హెల్త్ క్యాంపులు గురించి తెలియజేస్తారు.


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జిల్లాస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

జిల్లాస్థాయి ఆటలకు మండలంలోని వివిధ జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఇఒ తెలిపారు. బయ్యనగూడెం, జీలుగుమిల్లి, టి.నరసాపురం మండలంలో ఈనెల 22 వరకు నిర్వహించిన పోలవరం నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలలో వీరు ఎంపికయ్యారన్నారు. త్రోబాల్, వాలీబాల్, ఖోఖో, టెన్నీస్, టెన్నీ కాయిట్ జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు.

30లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గత మార్చిలో ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరై ఫెయిలైన విద్యార్థులకు రాబోవు మార్చి 2024 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు రాసేందుకు గాను పరీక్ష ఫీజును సెప్టెంబర్ 30వ తేదీ లోగా కళాశాలలో చెల్లించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు ఫెయిల్ మార్క్స్ మెమో పాటు, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక ఫోటో పట్టుకొని కళాశాలలో ఫీజు చెల్లించాల్సిందిగా ఆయన తెలిపారు.

ఘనంగా గణేష్ నిమజ్జనాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గణేష్ నిమజ్జనలు ఘనంగా నిర్వహించారు. శ్రీహరిపురం, కొమర్రు, ముదినేపల్లి, పెదపాలపర్రు, కోడూరు, దాకరం, పెయ్యేరు, చిగురుకోట, కాకరవాడ తదితర గ్రామాల్లో గణేష్ నిమజ్జనలు ఉత్సవ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లపై గణేష్ విగ్రహాలు ఉంచి ఊరేగింపు చేశారు. యువకులు, పెద్దలు, పిల్లలు పెద్దఎత్తున పాల్గొని సినీ పాటలకు నృత్యాలు చేస్తూ, గులాం చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. అనంతరం విగ్రహాలను ఆయా గ్రామాల్లోని పంట కాల్వల్లో నిమజ్జనలు చేశారు.


పైపులైను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

'తాగునీటి సమస్య పరిష్కారం'

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గ్రామ పంచాయతీలోని గణేష్ నగర్ కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా నీటి కొరత ఉండడంతో అక్కడ ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా వారి సమస్యలు విని వెంటనే స్పందించి గ్రామపంచాయతీ సర్పంచి పొడుం పుష్పకు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే పంచాయతీ సిబ్బంది చేత పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. దాదాపు 50 కుటుంబాల నీటి కొరత సమస్యను తీర్చారు. సమస్యను త్వరగా పరిష్కరించినందుకు ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేసి ఎంఎల్ఎ బాలరాజు, సర్పంచి పొడుం పుష్పకు కృతజ్ఞతలు తెలిపారు.


వాలీబాల్ కిట్లను అందజేస్తున్న వైసిపి నాయకులు

వాలీబాల్ కిట్లు అందజేత

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం గ్రామపంచాయతీ పరిధిలో ఎడ్లగూడెం గ్రామంలో టిబిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎ తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు వాలీబాల్ కిట్లను యువతకు వైసిపి నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలవరం వైసిపి యువ నాయకులు పొడుం శ్యామ్ కుమార్, ఈదేపల్లి వెంకట గణేష్, పోలవరం సచివాలయ కన్వీనర్ మాదేపల్లి సాయి రామకృష్ణ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

తలపై బలమైన గాయంతో మద్యం మత్తులో ఉన్న వ్యక్తి కాలువలో పడి అనుమానాస్పద మృతి చెందిన ఘటన ఏలూరు నగరంలో ఆదివారం చోటుచేసుకుంది. సంబంధిత వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు రూరల్ మండలం కలకుర్రు గ్రామానికి చెందిన ఘంటసాల వెంకట గోవర్ధన్(35)కు భార్య జయలక్ష్మి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఐదు ఎకరాల చేపల చెరువు సాగు చేస్తున్నాడు. అప్పులు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అతని భార్యకు, అతనికి గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 22న ఆమె పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతతకు గురి కావడంతో ఏలూరులోని జెఎంఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. అప్పటి నుంచి ప్రతిరోజు గోవర్ధన్ ఆసుపత్రికి వచ్చి వెళ్తున్నాడు. అతిగా మద్యం తాగుతున్నాడు. ఆదివారం ఉదయం ఏలూరు పాతబస్టాండ్ వద్ద కృష్ణా కాలువలో మృతి చెంది ఉన్నాడు. అతని తలకు బలమైన గాయం ఉంది. మద్యం మత్తులో బ్రిడ్జిపై నుంచి తూలి కాలువలో పడిపోయాడా, మరే ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో ఏలూరు టూటౌన్ పోలీసులు పరిశీలిస్తున్నారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.


మృతుడు గోవర్ధన్..

రోడ్లన్నీ గతుకులమయం..

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలో ఎక్కడ చూసినా గతుకుల రోడ్లతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా వర్షం వస్తే చెరువులు తలపించేలా రహదారులు మారాయి. దేవరపల్లి మండలం, నిడదవోలు నుంచి కొయ్యలగూడెం, పొంగుటూరు వరకు ఉన్న రాష్ట్ర రహదారికి కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రజలు, విద్యాసంస్థల వారి అవకాశం మేరకు గుంతలు పూడ్చడానికి విరాళాలు సేకరించి, రహదారుల గుంతలు పూడ్చారు. కానీ అతుకుల బొంతల కథ మళ్లీ మొదటికి వచ్చింది.


వాహనదారుల అవస్థలు

ముఖ్యంగా యడవోలు గ్రామం నుంచి కన్నాయిగూడెం వరకు ఆ రహదారిలో ప్రయాణం అంటే వ్యయప్రయాసలతో కూడుకున్నది. ఆ దారి నరకప్రాయంగా మారుతుందని ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. తప్పని పరిస్థితిలో తప్ప, ఇరు గ్రామ ప్రజలు ప్రయాణాలు కూడా వాయిదా వేసుకుంటున్నారు. ఇతర గ్రామాలతో పోల్చుకుంటే ఎంతో కొంత మెరుగ్గా ఉన్న కన్నాయిగూడెం రహదారి, 'ఖమ్మం టు దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ రోడ్ నిర్మాణములో భాగంగా, మట్టి తరలించే కార్యక్రమంలో కన్నాయిగూడెం నుంచి పొంగుటూరు వరకు వున్న రహదారి కూడా ధ్వంసం చేశారు.


బురదమయంతో రోడ్డు

ఎన్నిసార్లు గ్రీన్‌ఫీల్డ్ అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదు. ప్రభుత్వ అధికారులు కూడా ఈ సమస్యపై స్పందించడానికి మొహం చాటేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. 'కరిస్తే కప్పకి కోపం, విడిస్తే పాముకి కోపం' అన్నచందంగా అధికారులు, ప్రభుత్వ పాలకుల మధ్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

నూతన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

నూతన రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం అంగీకరించి, నిధులు మంజూరు చేసి 6 నెలలు కావస్తోందని ప్రజలు తీవ్ర ఆగ్రహానికి గురౌతున్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం స్పందించకపోతే పోరుకు సిద్ధమని ప్రతిపక్షాలు వెల్లడించాయి.

కన్నాయిగూడెం గ్రామస్తుల ఆవేదన

యడవోలు రోడ్ మీద కన్నాయిగూడెం రహదారి కొంతమేర బాగుండేది. కానీ గ్రీన్ ఫీల్డ్ రోడ్ నిర్మాణం చేపట్టాక అత్యంత దారుణంగా తయారయ్యాయి. దుమ్ము ఇళ్లలోనికి రావడంతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ప్రయాణం అంటేనే భయం వేస్తుందని వారు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు ప్రజలు అవస్థలు


పెద్ద పెద్ద గోతులతో రహదారి..

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు

విస్సాకోటి సతీష్, కన్నాయిగుడెం

రోడ్ నిర్మాణం చేసినంత కాలం నరకం చూశాం. నిరంతరం భారీ వాహనాలు తిరుగుతూనే వున్నాయి. రాత్రి లేదు, పగలు లేదు, పిల్లలు స్కూల్ బస్సులు కూడా రావడం ఇబ్బందికరంగా వుంది. ప్రజాశక్తి ద్వారా మా గోడు తెలియజేస్తున్నాం.

ప్రభుత్వం త్వరగా స్పందించాలి

నిమ్మగడ్డ కిషోర్, కన్నాయిగుడెం

రాత్రి సమయాల్లో భారీ వాహనాలు తిరగడంతో నిద్ర పట్టేది కాదు. ఆ దుమ్ము ఇళ్లలోకి చేరి పిల్లలకు వ్యాధులు వచ్చేవి, అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

వారాల పండుగలో విషాదం

గుండుపోటుతో కళాకారుడు మృతి

ప్రజాశక్తి - భీమడోలు



గుండుగొలను డోకల వారి వీధిలో ఆదివారం వారాల పండగలో విషాదం చోటుచేసుకుంది. వారాల పండుగ సందర్భంగా శక్తి వేషాలు వేశారు. ఈ క్రమంలో ఏలూరు మండలం పొనంగి గ్రామానికి చెందిన శక్తి వేషం బృంద సభ్యుడు వేమూరి పోతురాజు(40) నృత్యం, విన్యాసాలు చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. వెంటనే స్థానిక ఆసుపత్రి తరలించగా అప్పటికే అతను మృతి చెందాడని వైద్యులు తెలిపారు. దీంతో విషాదం నెలకొంది.

నేడు విద్యుత్ ప్రమాదాలపై సమావేశం

ప్రజాశక్తి - చింతలపూడి

ఆయన తెలిపిన వివరాల ప్రకారం పామాయిల్ గెలలు కోసేటప్పుడు జరుగుతున్న విద్యుత్ షాక్ ప్రమాదాలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 25న సమావేం నిర్వహిస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎఇ వెంకయ్య తెలిపారు. చింతలపూడి సెక్షన్ కార్యాలయంలో పామాయిల్ రైతులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో ఆదివారం పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు మండలంలోని పామాయిల్ రైతులందరూ సెక్షన్ కార్యాలయంకు చేరుకోవాలని ఆయన కోరారు.

వృద్ధుల సంరక్షణ చట్టాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


సమావేశంలో మాట్లాడుతున్న బాపూజీ

వృద్ధుల సంరక్షణకు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కె. రామచంద్రరావు తెలిపారు. ఆదివారం బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జంగారెడ్డిగూడెం యూనిట్‌సభ్యుల సమావేశం స్థానిక కిడ్స్ స్కూల్‌లో కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ అక్టోబర్ 1న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా చేపట్టే కార్యక్రమాల గురించి చర్చించామన్నారు. వృద్ధుల ఆటపాటల షెడ్యూల్ వివరించారు. ఆటలతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సత్యనారాయణ, రాధాకృష్ణ, బాలకృష్ణ, సూర్యారావు, కోరా నాగేశ్వరరావు, భాస్కరరావు, దత్తాత్రేయుడు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ డిమాండ్ చేశారు. దళితులపై జరుగుతున్న దాడులుపై ఆగిరిపల్లిలో ఆదివారం సత్తు కోటేశ్వరరావు అధ్యక్షతన వ్యవసాయ కార్మికసంఘం, దళితసంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల హక్కులను పాలకవర్గాలు కాలరాస్తున్నాయని, 9/77 అసైన్డ్ చట్టాన్ని కాలారాసి, దళితులకు భూమి లేకుండా చేస్తున్నాయన్నారు. భూస్వాముల పక్షాన ప్రభుత్వాలు నిలబడి దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుల హక్కులు - సామాజిక న్యాయం కోసం ఈనెల 29న విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే ధర్నాలో పెద్ద ఎత్తున దళితులు, ప్రజాతంత్ర వాదులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు విల్సన్‌రాజు, సురేష్‌బాబు, నాగేశ్వరరావు, సుధాకర్, బాషాలు పాల్గొన్నారు.

సొసైటీ మాజీ అధ్యక్షులు కృష్ణమూర్తి మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం



కె.జగ్గవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ అధ్యక్షుడు వెలిది కృష్ణమూర్తి(78) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. 40 సంవత్సరాల పాటు సొసైటీకి విశేష సేవలు అందించిన ఆయన ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో మృతి చెందినట్లు వారు తెలిపారు. ఆయన మృతి పట్ల ప్రస్తుత సొసైటీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి మధు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా ప్రజలకు కృష్ణమూర్తి అందించిన సేవలు మరువలేమన్నారు. హైదరాబాద్‌లో ప్రెయివేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ, మృతి చెందడం బాధాకరం అన్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కె.జగ్గవరం సొసైటీకి రూ.కోటి పైబడి విలువ చేసే స్థలాన్ని ఇచ్చి సంఘ భవనాలు, గిడ్డంగుల నిర్మాణానికి ఎనలేని కృషి చేసిశారన్నారు. 40 సంవత్సరాల పైబడి సొసైటీ అధ్యక్షునిగా, 5 సంవత్సరాలు కేతవరం గ్రామ పంచాయతీ సర్పంచిగా ఎనలేని సేవలు అందించారని ఆయన సేవలను కొనియాడారు. ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ సోమవారం నిర్వహించాల్సిన కె.జగ్గవరం సొసైటీ మహాజన సభను వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఛైర్‌పర్సన్ మధుతో పాటు పర్సన్లు వంటిపల్లి వెంకటేశ్వరరావు, కొరప్రోలు చంద్రశేఖర్ రెడ్డి, సిఇఒ తనగాల వీర వెంకయ్య, సంఘ సిబ్బంది తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కొనసాగిన టిడిపి నిరసనలు


ముదినేపల్లిలో జలదీక్ష చేస్తున్న నేతలు



ముసునూరులో..

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ మండలంలోని గుర్వాయిగూడెంలో టిడిపి మండల అధ్యక్షులు సాయిల సత్యనారాయణ అధ్యక్షతన నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలు టిడిపి మండల మాజీ అధ్యక్షుడు ముళ్లపూడి శ్రీను, తెలుగు యువత మండల అధ్యక్షుడు గోలి అనిల్ ప్రారంభించారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన మాజీ ఎంపీ మాగంటి బాబు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక వైసిపి ప్రభుత్వం దుర్మార్గంగా అరెస్టు చేయిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, కోనేరు వెంకట సుబ్బారావు, నెక్కలపుడి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నేతలు జలదీక్ష

ముదినేపల్లి : చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా ఆదివారం టిడిపి నేతలు జలదీక్ష చేపట్టారు. మండలంలోని అల్లూరులో తెలుగు యువత ఆధ్వర్యంలో తెలుగు యువత నాయకులు జలదీక్ష చేశారు.



జంగారెడ్డిగూడెంలో..

నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు దావు నాగరాజు, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ పూల రామచంద్రరావు, వీరబత్తిన సుధా, పంతగాని నాగశ్రీనివాస్, తదితరులు స్థానిక సిబి కెనాల్‌లో జలదీక్ష చేపట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు కడిగిన ముత్యంలా జైలు నుంచి త్వరలో బయటకు వస్తారన్నారు. చంద్రబాబునాయును అక్రమంగా అరెస్టు చేసి, జైలుకు పంపిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, ఆపార్టీని రాష్ట్ర ప్రజలు 20204లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బంగాళాఖాతంలో కలిపేయడం ఖాయమని హెచ్చరించారు. గత పదేళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉన్న 32 కేసుల్లో కోర్టుకు హాజరుకాకుండా బెయిల్‌పై బయట తిరుగుతున్నాడన్నారు. రాష్ట్ర ప్రజలు జరుగుతున్న వాస్తవాలు గమనిస్తున్నారని, జగన్ మళ్లీ జైలుకు వెళ్లడం తథ్యమని జోస్యం చెప్పారు.

చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా టిడిపి శ్రేణులు మండలంలోని పెదపాలపర్రులో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో 15వ రోజుకు చేరాయి. మండల పార్టీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి ఆధ్వర్యంలో ఈ రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు ఉంటే ప్రజాక్షేత్రంలో గెలవలేమనే భయంతో చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి సిఎం జగన్ పైశాచికానందం పొందుతున్నారన్నారు. ఈ దీక్షలో గ్రామ సర్పంచి గంటా రాకేష్, చల్లగుళ్ల ఆదిత్య చౌదరి, బొంగు రవికుమార్, దావు నాగరాజు, దారం సుధా, పి.పాండురంగారావు, ఈడే సుధాకర్, సి హెచ్. జగన్‌మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో పోలీసుల తనిఖీ

జీలుగుమిల్లి: మండలంలోని ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో ఆదివారం ఉదయం నుంచి పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. జీలుగుమిల్లి ఎస్ఐ వి.చంద్రశేఖర్, ఎస్ఐబి సిబ్బంది ఆధ్వర్యంలో వాహన తనిఖీలు ముమ్మరంగా చేశారు. చంద్రబాబు అరెస్టను ఖండిస్తూ ఆయనకు సంఘీభావంగా హైదరాబాద్ నుంచి రాజమండ్రికి ర్యాలీగా వస్తారనే సమాచారం మేరకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో జీలుగుమిల్లి సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద పోలీసులు పికెట్ ఏర్పాటు చేసి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.

కొయ్యలగూడెం: టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మండలకేంద్రమైన కొయ్యలగూడెంలో నాయకులు, కార్యకర్తలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 12వ రోజుకు చేరుకున్నాయి.నీ సందర్భంగా టిడిపి నేతలు ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జీలుగుమిల్లిలో పోలీసుల తనిఖీ..

ముసునూరు : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఆదివారం మండల కేంద్రమైన ముసునూరు మండపం సెంటర్ వద్ద టిడిపి రిలే నిరాహార దీక్షలులో గద్దె రఘుబాబు, తుమ్మల నాగేశ్వరరావు, మానం ఘంటేశ్వరరావు, వెలుపుచెర్ల, చల్లబోయినపల్లి, గ్రామాల టిడిపి నాయకులు, మహిళా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.


గురజ ఎస్‌టి కాలనీలోకి చేరిన వర్షపు నీరు

ముదినేపల్లిలో వర్షం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలకేంద్రమైన ముదినేపల్లిలో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పల్లపు ప్రాంతాల కాలనీలు జలమయమయ్యాయి. వర్షపు నీరు కాలనీ వాసుల ఇళ్ల ముందు చేరడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రాకపోకలు సాగించేందుకు ఇక్కట్లు పడ్డారు. పలు కాలనీల్లో నీరు బయటకు వెళ్లే అవకాశం లేక రోజుల తరబడి ఇక్కడనే నిల్వ ఉంటుంది. దీంతో కాలనీ వాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షంతో గ్రామాల్లోని అంతర్గత రోడ్లు జలమయం కావడంతో ప్రజలు, ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు అవస్థలు పడ్డారు. వర్షం రాకతో ముదినేపల్లి సెంటర్ బురదమయంగా మారింది. సెంటర్‌లో రహదారి విస్తరణ పనులు జరుగుతుండడంతో వర్షానికి బురద రోడ్లుపైకి చేరుతోంది. రోడ్లపై ఏర్పడ్డ గుంతల్లో వర్షపు నీరు చేరి దారి కనబడక ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం మండలంలోని ఖరీఫ్, వరి సాగుకు మంచి ఉపయోగకరంగా ఉంటుందని పలువురు రైతులు చెబుతున్నారు.


సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెంబీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు సుదూర ప్రాంతాల నుంచి ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో, ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేశారు.

నూతన కమిటీ రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ఉండి

రైతుల అభ్యున్నతికి నూతన కమిటీ కృషి చేయాలని పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అధ్యక్షతన నిర్వహించిన ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడారు. వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన కమిటీ రైతులకు అందుబాటులో ఉంటూ వారి అభ్యున్నతికి కృషి చేయాలని వారు సూచించారు. మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రంలోని శాస్త్రవేత్తలతో అనుసంధానమై వారి సలహాలు సూచనలు తీసుకుని రైతులకు తోడ్పాటు అందించాలన్నారు. ఏ కాలంలో ఏయే ఏ పంటలు పండించాలనే విషయంపై శాస్త్రవేత్తలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పుంత రహదారులను అభివృద్ధి చేసి రైతుల పంటను మిల్లర్లకు అందించేందుకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా చూడాలన్నారు. అనంతరం నూతన కమిటీ ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్ చేకూరి రాజా నరేంద్ర కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ, గుడాల శ్రీహరి గోపాలరావు, రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఎంఎల్ఎ కౌరు శ్రీనివాస్, డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, మేడిది జాన్సన్, చినమిల్లి రాయుడు, ఉండి సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ పాల్గొన్నారు.